అదేననీ వాళ్ళర్థం చేసుకోలేరు!

'వాళ్ళే కాదు. ఆడపిల్లలకి డిగ్రీ కోర్సులు చెప్పించిన ఏ తల్లి తండ్రులైనా అంతే! ఏ పోస్టు గ్రాడ్యుయేటో వెయ్యి పదిహేను వందల జీతగాడో రావాలనుకుంటారు! అప్పులపాలై, వేలకి వేలు కట్నాలు పోసి ఇల్లు గుల్ల చేసుకుంటారు. ఇలాంటి వాళ్ళుండబట్టే ఆ వరుళ్ళు మూటలు అందుకుంటున్నారు.

'భర్తకన్నా చదువు తక్కువ అయితే అతను సహించటం లేదా? అలాంటప్పుడు భార్యకన్నా భర్త తక్కువ చదివితే ఏం? తరాలు మారినా జీర్ణించుకుపోయిన ఈ గుణాలు మారకపోవటం వల్లనే ఇన్నేసి బాధలు, కష్టాలు, సమస్యలు వస్తున్నాయి! తృప్తికి మించిన సుఖం మరోటి వుందా? పరిస్థితులను అర్థం చేసుకోడం ఎంతటి వరం!! అందుకే తను ఈ పెళ్ళికి ఒప్పుకుని ఇంచు మించు దెబ్బలాడినంత పనిచేసి ఉపేంద్రని భర్తగా పొందింది.

'ఈ నాల్గు సంవత్సరాలు తామిద్దరు తమ కన్న వారికి, ఆర్థికంగా సహాయాలు చేస్తూ ఇంటికి కావల్సిన వన్నీ స్వయంగా కొనుక్కుని అప్పటి వరకు అదనపు బాధ్యత పెరగకుండా జాగ్రత్త పడ్డారు. కనుకనే ఇంకా ఇంట్లో ఉయ్యాల వెలియలేదు. కానీ తన తమ్ముడి కాలేజి చదువు పూర్తి ఐంది. ఉపేంద్ర, చెల్లికి పెళ్ళి చేయించేడు. తమ వల్ల ఆ రెండు కుటుంబాలు బాగుపడుతున్నాయి. తామూ హాయిగా వున్నారు! ఇంతకన్నా తనకి కావల్సిందేమిటీ? ఇప్పుడు గనుక ఆనాటి త్రివిక్రమ రావు, రవిచంద్ర కనబడితే-ఎంత బాగుండును? ప్చ! ప్చ! ఎందుకు కనబడతారు? నాలాంటి వాళ్ళకి కనబడరు! – ఎక్కడో ఏ తండ్రినో కొల్లగొట్టి.... లేదా లక్షాధికారికి అల్లుడై కాలరెత్తుకుంటూ వుంటాడు, రవి చంద్ర! ఇలాంటివాళ్ళు ఈ తరంలో దిష్టి పిడతలు! ఇదిగో నా ఉపేంద్రలాంటి వారు దివిటీలు!' అనుకుంటూ మురిపెంగా చూసింది భర్తని.

అప్పటికి రెండుసార్లు పలకరించి, పలకక్క పోయేసరికి "వినయగారూ–రేపటి ప్రోగ్రాములు ఊహించుకుంటూ ఇవాళ సంగతులు మర్చిపోకండి! వంట ప్రయత్నం చేయగలరా? లేక నన్నే చేయమంటారా?" అంటూ చెవి దగ్గర అరిచేడు.

చిన్నగా నవ్వి – లేచింది వినయమణి! ❋



లయన్ లేడి డా. ఎ. హైమవతీదేవి లయన్ ఆర్. నారాయణరావుకు మెమెంటో బహూకరిస్తున్నారు. కుడివైపున–లయన్ డా. ఎ. ఆర్. సుబ్రహ్మణ్యం, ఎడమ వైపు-లయన్ లేడీ శేమస్వామి.

విశాఖపట్నంలోని మూడు లయన్ మహిళా సంఘాల ప్రథమ సంయుక్త సమావేశం ఇటీవల జరిగింది. లయన్ లేడీ డా॥ ఎ. హైమవతీ దేవి అధ్యక్షత వహించారు. 324 – C డిస్ట్రిక్ట్ లయన్స్ సంస్థ మహిళా సంఘాల చైర్మన్, లయన్ ఆర్. నారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లయన్ లేడీ శేమస్వామి ప్రార్థనానంతరం లయన్ లేడీ డా॥ హైమవతీదేవి ఆహూతులకు స్వాగతం పలుకుతూ నగరంలోని లయన్ లేడీస్ నిర్వహించిన కార్యక్రమాలను నివేదించారు. అనంతరం ముఖ్య అతిథి ఆర్. నారాయణరావు మాట్లాడుతూ సంఘంలోని దౌర్బల్యాలను పారద్రోలటంలోను, బీదసాదలకు, వ్యాధిగ్రస్తులకు, నిస్సహాయులకు సేవ చెయ్యటంలోను లయన్స్ సంస్థ మహిళలు గణనీయమైన పాత్ర నిరహించవలసి వున్నదని, ఇందు నిమిత్తం లయన్స్ మహిళలు ఆరోగ్య, విద్యా విషయాలలోను, తదితర సంఘ సేవలలోను పురుష సభ్యులతో కలిసిగాని, లేక తమకు తాముగా గాని తగిన పథకాలను చేపట్టవలసి వుందనీ అన్నారు. లయన్ లేడీ ఇందిరా నారాయణరావు "విశాఖ లయన్ లేడీస్ క్లబ్" ఒక ఉచిత వైద్యశాలను, రెండు హోమియో వైద్యశాలలను నిర్వహిస్తూందని, పేదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తూ వుందని అన్నారు. అంతేగాక యీ సంవత్సరం మురికివాడల మెరుగుదలకు, బాలబాలికల ఆరోగ్య పరిస్థితి గురించి పరిశీలనకు, వారికి పోషకాహారం లభ్యమయ్యేందుకు తగిన కార్యక్రమాలను చేపడుతూందని కూడా అన్నారు. డా॥ ఎ. ఆర్. సుబ్రమణ్యం లయన్ లేడీస్ క్లబ్ ఒక సేవాసంస్థ అనీ, సంఘానికి మరింత సేవ చెయ్యటానికి నిర్వాహకులు ద్విగుణీకృతంగా కృషి చెయ్యాలనీ, జిల్లా అధికారులు సుముఖంగా వుంటే వారి సహకారాన్ని కూడా వినియోగించుకొని సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. లయన్ కాశిం ఎస్. మెహదీ స్త్రీ సభ్యులు నిర్వహించే కార్యక్రమాలలో పురుష సభ్యుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. లయన్ లేడీ రంజిత్ బింద్రా వందనసమర్పణతో సమావేశం ముగిసింది.

❋

30వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విశాఖ ఆంధ్రా యూనివర్శిటీ అసెంబ్లీ హాలులో నగరంలోని సేవా సంస్థల సమన్వయ సమితి ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో యీ సంస్థల మహిళా సంఘాలన్నీ పాల్గొన్నాయి. పాస్ట్ రోటరీ గవర్నరు శ్రీ కె. ఎస్. దత్ జాతీయ పతాకను ఆవిష్కరించారు. విశాఖ లయన్ లేడీస్ క్లబ్ సభ్యురాండ్రు తమ గ్రూపు తరఫున జాతీయ గీతాన్ని ఆలాపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న 'పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' విభాగ ప్రధానాధ్యాపకులు ప్రొ. ఆర్. వి. ఆర్. చంద్రశేఖరరావు 'స్వాతంత్ర్యానికి మూల్యం నిరంతర జాగరూకతే!'–అనే అంశం మీద ప్రసంగించారు.

❋

విశాఖ పోర్టు (హార్బరు) క్వార్టర్సు కంచరపాలెం శ్రీ శారదా మహిళా సమాజం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రయాగ సీత గాత్ర సంగీత కచేరీ, వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినం నాడు ముఖ్య అతిథిగా పాల్గొన్న పోర్టు ట్రస్టు ఛెయిర్మన్ సతీమణి శ్రీమతి సీతా బి. కె. రావు పతాకావిష్కరణ చేయగా సమాజ సభ్యురాండ్రు జాతీయ గీతాలు పాడారు. పిల్లలు కన్నులవిందుగా 'కోలాటం' (డాన్సు) చేశారు. కార్యదర్శి శ్రీమతి కళా రామకృష్ణ పిల్లలకు మిఠాయి, స్త్రీ సభ్యురాండ్రకు పండ్లూ–తాంబూలాలు పంచిపెట్టారు. —విలేకరి